# పెద్దమేడ

ఆ వీధిలో ఒక పెద్దమేడ ఉన్నది.

ఆ దారిని పోతూవున్న వాళ్లు తలెత్తి ఆ మేడకేసి చూచి మళ్లీ తల కిందికి దించరు. ఆశ్చర్యపోతారు. వాళ్లు ఆ మేడలో అందమే చూస్తారో, ఉన్నతే చూస్తారో, ధన దేవతనే చూస్తారో, చెప్పడము కష్టము.

ఆ మేడను ఆశ్రయించుకొని చాలా ఇళ్లు ఉన్నవి. మండువా ఇళ్లూ, పూరిళ్లు, గుడిసెలూ. ఆ ఇంటి పక్కనే రాములవారి కోవెల ఉన్నది. ఆ పెద్దమేడ మేఘ మండలాలలో నుంచి కోవెల కేసి పెంకెతనపు చూపు చూస్తూ ఉంటుంది. చూపు తగిలి కోవెలలో ఉన్న రాములవారు ఒక మూలకు ఒదిగిపోయారా అనిపిస్తుంది.

ఆ మేడను డబ్బుతో కట్టారు.

మండువా ఇళ్లనూ, పూరిళ్లనూ, గుడిసెలనూ మర్యాదతో కట్టారు.

కోవెలను భక్తితో కట్టారు.

ఆ మేడను ఆశ్రయించుకొని కొందరు మనుష్యులున్నారు. వారు ఎప్పుడూ రూపాయల చప్పుడులో మునిగి ఉంటారు.

ఆ రూపాయల చప్పుడులో పక్క కోవెలలోని తూర్యనాదాలు వారికి వినిపించవు. పక్క కుటీరాలలోని స్వచ్ఛ హృదయ పరిమళము వారా ఘ్రాణించలేరు.

ఆ మేడలో గూడు కట్టుకొనడానికి ఒక పిచ్చికైనారాదు.

ఆ మేడమీద విశ్రాంతి తీసుకోవడానికి ఒక పావురమైనా వాలదు. గంగడోలు గోకించుకోడానికి ఒక ఆవైనా ఆ మేడముందు నిలువదు.

ఆ గుడిసెలలో కొందరు మనుష్యులు కాపురమున్నారు. ఆ గుడిసెల చూరులలోనే కొన్ని పిచికలు కూడా కాపురమున్నవి. ఆ గుడిసెల పంచ పెరిగిన పచ్చ చెట్ల మీద చిలకలు కబుర్లు చెప్పుకుంటవి.

ఆ గుడిసెల పంచలలో మేక పిల్లలు సరదాగా ఆడుకొంటవి.

ఆవులు ఆ పంచలలో చేరి మెడామెడా రాచుకొంటూ కూర్కు చెందుతవి. మనుష్యులూ, పక్షులూ, జంతువులూ, అరమరిక లేకుండా అక్కడ కాపురము చేస్తున్నారు.

కోవెలలో శ్రీరామచంద్రమూర్తి వెలిశాడు. రాములవారి పాదదర్శనము కోరి ప్రతి ఉదయమూ గుడిసెలలోని ప్రజలు ఆలయములో మూగుతారు.

రాములవారి ద్వారా ధనదేవతను ఉపాసించడానికి మేడలోని వారు బట్టలూ, పువ్వులూ, పండ్లు అనే లంచాలతో అక్కడికి ప్రతి ఉదయమూ వస్తారు.

కోవెల గూళ్లను పావురాలు స్వగృహాలు చేసుకొన్నవి. కోవెల ముందున్న వరికంకులను పిచికలు స్వేచ్ఛగా అనుభవిస్తవి. కోవెల గోపురాల మీద చిలకలు విశ్రాంతికై వాలి మనశ్శాంతి పొందుతవి.

కోవెల ముందు ఆ దారిని పోయే ఆవులు ఆగి కనురెప్పలతో నమస్కారాలు రాములవారి పాదాలకు సమర్పిస్తవి.

రాముల వారి ఎదుట పావురాలు మొగ్గలు వేసి వినోదము కల్పిస్తవి.

రాములవారి ఒడిలో పిచికలు సుఖనిద్ర పొందుతవి.

రాములవారి పలుకులు అనుకరించబోయి చిలకలు చిన్న బుచ్చుకొంటూ ఉంటే రాములవారు విలాసముగా నవ్వుతారు.

రాములవారికి వసంతోత్సవము జరిగే కాలాన కోకిలలు తూర్యనాదాలతో తమ స్వరాలు కలిపి ఆ ఉత్సవానికి కొత్త అందము తీసుక వస్తవి.

గోవులు తమ కోమల హృదయ కోరకాలను రాములవారికర్పించి సమాధి చెందినట్లు కోవెల పంచ నిద్రపోతవి.

మేడలో వారు బజారులో కొని తెచ్చిన పువ్వులను శిఖలలో ధరిస్తారు. గుడిసెల ముందు పూల మొక్కలు నవ్విన పువ్వులు రాములవారి దేహము నాశ్రయించి పావనమౌతవి. తరువాత గుడిసెలలో వారి శిఖలలో ప్రవేశిస్తవి.

సంక్రాంతి పండుగ వచ్చింది.

రాములవారికి ప్రతిరోజూ ఉత్సవాలు జరుపుతున్నారు ప్రజలు. ఆ ఉత్సవాలు చూచి మనుష్యులూ, పశు పక్ష్యాదులూ అందరూ సంతోషిస్తున్నారు.

సంక్రాంతి పండుగనాడు గుడిసెలన్నీ ముస్తాబైనవి. గుడిసెల ముందు రకరకాల ముగ్గులు వికాసము చూపుతున్నవి.

పెద్దమేడ కూడా ముస్తాబైంది. ఆ ముస్తాబు చమ్కీ బట్టల ముస్తాబులాగ ఉన్నది.

కోవెలకు దివ్య తేజస్సు ఆనాడు వచ్చింది. రాములవారి హృదయము భక్తుల ప్రార్థనలవల్ల మహాసముద్రమై ఉప్పొంగిపోతూ ఉన్నది. రాములవారు ఆనాడు చాచిన రెండు చేతుల మధ్యకూ ఎందరైనా పోయి దివ్య సౌఖ్యములు పొందవచ్చు నన్నట్లున్నవి. ఆ దేవుని కౌగిలి అనంత కైవారము. ఆ కౌగిలిలో ఊహకు అందని ఆనందము నిబిడీకృతమై ఉన్నది. ఆ కౌగిలిలో ఆనందము నూతన జీవనమును ప్రసాదించగలదు. అటువంటి కౌగిలి ఆనాడు ప్రజలు రాములవారి అపార కృపా విశేషముచేత కలిగింది.

గుడిసెలలోని వారు ఆ కౌగిలిలో చిక్కుకొన్నారు. చిలకలూ, కోయిలలూ, గోవులూ, మున్నగు భక్తులందరూ కౌగిలి విందు గైకొని సౌఖ్యమునను భవిస్తున్నారు. మేడవారికి రాములవారి కౌగిలి కనబడలేదు. రాములవారు చేసుకొన్న ముస్తాబు మాత్రమే చూచి వారు మురిసినారు.

కోవెల ముందు కూడా సంక్రాంతి ముగ్గులు పెట్టారు. పెద్ద రథము, గంటల రథము, జెండాల రథము సర్వాంగ సుందరమై కోవెల ముందు అది జీవకళలతో ప్రకాశిస్తున్నది. ఆ రథము మీద అంతటా పువ్వులు హసిస్తున్నవి. ఆ రథము మీద పసుపూ కుంకుమ పావనత్వాన్ని వెదజల్లుతున్నవి. ఆ రథం మీద రాములవారు కూర్చున్నారా అన్న మోస్తరుగా అది ప్రకాశిస్తున్నది. పెద్దమేడముందు కూడా ముగ్గులున్నవి. రథములు, గుంటల కోనేళ్ళు, తాబేళ్ళు, పాములు, గుమ్మడి పండ్లు ఎన్నో రకాల ముగ్గులు. ఆ ముగ్గుల మీద పువ్వులూ ఉన్నవి. అవి అన్నీ కునుకు పాట్లు పడుతూ ఉన్నట్లున్నవి.

మహా వైభవముతో తాను చేసుకొన్న ముస్తాబు చూచుకొని, ప్రక్క గుడిసెల ముస్తాబు ఆ కళ్లతోనే

చూచి పెద్దమేడ నవ్వింది. గుడిసెలు తమ ముస్తాబు చూచుకొని పెద్దమేడ ముస్తాబు చూడజాలక కోవెల పక్కకొదిగి ప్రతి నవ్వు నవ్వినవి.

మేడ కోపముతో ప్రశ్నించింది!

"ఎందుకు నన్ను చూచి నవ్వుతారు?"

"నీ నవ్వుకు ప్రతిగా మేము నవ్వాము."

"నా అంతస్థులు విశాలములు. అందులో కళాశోభితములైన స్థంభాలు సుందరములు, నా గోడలమీది చిత్రములు రంగులతో పులకరిస్తూ ఉంటవి. నా శిఖరము మీది గోపురము లతాద్యలంకారాలతో కిరీట శోభ పొంతున్నవి. నాలో అందమంతా ఇమిడి ఉన్నది. వీటిని అతిశయించే నా ఉన్నతి మీరు కళ్లెత్తి చూడరానిది. నా నవ్వుకు కారణము ఇప్పుడు మీకు బోధపడిందా?"

"ఆ ఉన్నతి చూచుకొని నీవు నవ్వావు కాబోలు. నీ అంతస్థుల అమరిక మా ధైర్యమువల్ల కలిగిందే. కళాశోభితమైన స్థంభాలు మా కౌశలమునే ప్రకటిస్తున్నవి. గోడలమీది చిత్రాలు మా ఓర్పుకూ, నేర్పుకూ నిదర్శనాలు. నీ కిరీటము నీకు మేము పెట్టిందే. నీ ఉన్నతి నీకు మేము కల్పించిందే."

"మీ ధైర్యమును, మీ కౌశల్యమును, మీ ఓదార్పును, మీ ఓర్పును, నేను మీకు ప్రతిఫలమిచ్చి కొనుక్కున్నాను. అందువల్ల వాటి ప్రసక్తి మీకు ఉండరాదు."

"మా కౌశల్యాదులు తుచ్ఛమైన ధనముతో సరితూగవు."

ఈ సంభాషణ విని కోవెల ఫక్కున నవ్వింది.

ఆ నవ్వు విని గుడిసెలు సిగ్గుతో తలలు వంచుకొన్నవి. ఆ నవ్వు చూచి పెద్దమేడ అపరిమితమైన ఆనందము పొందింది.

చాలాకాలము గడచింది.

గుడిసెలుండే చోట ఒక వనము పెరిగింది. ఆ వనములో పూల మొక్కలూ, పళ్లచెట్లూ, దుబ్బులూ పెరిగినవి. పూల మొక్కల మీద తుమ్మెదలూ, సీతాకోకచిలుకలూ ఆడుకొంటూ ఉంటవి ఎప్పుడూను. పళ్లచెట్లమీద నివాసము ఏర్పాటు చేసుకొని రకరకాల పక్షులు పళ్లు తింటూ గానము చేస్తూ ఉంటవి. దుబ్బులలో అనేకరకాల కీటకములూ, చిన్న జంతువులూ, చిన్న పక్షులూ తలదాచుకుంటూ ఉంటవి. ఆ వనమంతా ఎప్పుడూ కలకలలాడుతూ ఉంటుంది.

కోవెల ఉండేచోట ఒక రావిచెట్టు మొలిచింది. ఆ రావిచెట్టు ఆ ప్రాంతాల జంతుజాలానికంతకూ చలవ ఇస్తూ ఉంటుంది. ఆ రావిచెట్టు మొదటా, కొమ్మలమీదా, ఆకులమీదా అంతా జీవకోటే. రావిచెట్టు ఆకుల గలగల జంతుజాలాని అంతనూ జోకొట్టుతూ ఉంటుంది.

పెద్దమేడ ఉండేచోట రాళ్లగుట్టలు ఉన్నవి. ఆ గుట్టల చుట్టూ బొమ్మచెముడు మొలిచిపోయింది. ఆ గుట్టల నిండా పాముల పుట్టలు. రాత్రివేళ గుడ్లగూబలు ఆ గుట్టలెక్కి కూస్తూ ఉండడం కూడా కద్దు.

రావిచెట్టు ఆగుట్టల మీద కూడా పళ్లురాల్చి మొక్కలు మొలిపించాలని చూస్తూ ఉంటుంది. కాని జంతువులు ఆ మొలకలను బతకనియ్యవు.